క్లుప్తంగా

లక్ష్మీపురం విద్యార్థుల ప్రతిభ



లచ్చుబుగత లహరి, బమ్మిడి సురేంద్ర

తగరపువలస: ఈ నెల 4 నుంచి 6 వరకు కర్నూలు జిల్లా ఎమ్మిగనూరులో జరుగనున్న ఏపీ స్కూల్ గేమ్ ఫెడరేషన్ అండర్ – 17 బాల బాలికల రాష్ట్ర స్థాయి పోటీలకు భీమిలి మండలం లక్ష్మీపురం జెడ్పీ హైస్కూల్‌కు చెందిన ఇద్దరు విద్యార్థులు ఎంపికయ్యారు. జిల్లా తరపున జట్టులో పదో తరగతి విద్యార్థులు లచ్చుబుగత లహరి, బమ్మిడి సురేంద్ర పాల్గొననున్నారు. వీరిని ప్రధానోపాధ్యాయుడు గాడు పైడిరాజు, ఫిజికల్ డైరెక్టర్ ఎం.లలిత్‌కుమార్, ఉపాధ్యాయులు పైడినాయుడు, బషీర్‌ఖాన్, లక్ష్మణ్, శ్రీనివాస్, అంబిక తదితరులు అభినందించారు.

వృద్ధురాలి అదృశ్యం



ముసినాడ ఈశ్వరమ్మ

తగరపువలస: భీమిలి మండలం అమనాం పంచాయతీకి చెందిన ముసినాడ ఈశ్వరమ్మ అనే వృద్ధురాలు గత నెల 10న ఇంటి నుంచి అదృశ్యమయింది. ఈ మేరకు ఆమె కుమారుడు వెంకటరమణ గురువారం భీమిలి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. తన తల్లికి మతిస్థిమితం సరిగా లేదని, చుట్టుపక్కల తెలిసిన వారి ఇళ్ల వద్ద గాలించినా ఆచూకీ తెలియలేదన్నారు. భీమిలి హెడ్ కానిస్టేబుల్ జి.సత్యనారాయణ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వైఎస్సార్ బీమా అందజేత



బీమా నగదు అందజేస్తున్న 4వ వార్డు కార్పొరేటర్ దౌలపల్లి కొండబాబు

కొమ్మాది: భీమిలి బీచ్ రోడ్డు జీవీఎంసీ 4వ వార్డు కాపులుప్పాడ ప్రాంతానికి చెందిన గుడ్ల నర్సింగ్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఆయనకు వైఎస్సార్ బీమా వర్తించడంతో మృతుని భార్య గుడ్ల మల్లేశ్వరికి కార్పొరేటర్ దౌలపల్లి కొండబాబు తక్షణ సహాయం రూ.10 వేలు గురువారం అందజేశారు. మిగిలిన రూ.4.90 లక్షలు బ్యాంకు అకౌంటులో జమ అవుతాయని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు పాల రమణారెడ్డి, మాజీ సర్పంచ్ ఎరుసు అప్పలకొండరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కారు దహనం



పూర్తిగా కాలిపోయిన కారు

కొమ్మాది: జీవీఎంసీ 8వ వార్డు గుడ్లవానిపాలెంలో నివసిస్తున్న గుడ్ల లక్ష్మణ్‌రెడ్డి కారుకు బుధవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు అంటించారు. పూర్తి స్థాయిలో కారు దహనమైపోయింది. గురువారం ఉదయం లక్ష్మణ్ రెడ్డి చూడగా కారు కాలిపోవడంతో ఆందోళనకు గురై ఆరిలోవ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

అంతర్జాతీయ పరుగు పోటీలకు లావణ్య



భీమునిపట్నం: భీమిలికి చెందిన కందుకూరి లావణ్య అంతర్జాతీయ పరుగు పందెం పోటీలకు ఎంపికయ్యారు. ఈమె నవంబర్ 8 నుంచి 12 వరకు ఫిలిప్పీన్స్ దేశంలో నిర్వహించే ఆసియా మాస్టర్స్ అథ్లెటిక్ చాంపియన్‌షిప్ పోటీల్లో 55 సంవత్సరాల పైబడిన విభాగంలో పాల్గొంటారు. ఈమె గత మే నెలలో కురుక్షేత్రలో జరిగిన జాతీయ పోటీల్లో పది వేల మీటర్ల పరుగు పందెంలో ద్వితీయ స్థానం సాధించడంతో ఈ పోటీలకు ఎంపికయ్యారు.

నిరుపయోగంగా పబ్లిక్ టాయిలెట్లు

- నిర్వహణ లేక శిథిలావస్థకు..
- మరోవైపు బహిరంగ మలవిసర్జనతో నదీ తీరప్రాంతాలు కలుషితం



కేర్ టేకర్లు లేక మూతపడిన బంగ్లామెట్ట పబ్లిక్ టాయిలెట్లు

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్‌లో పలుచోట్ల పబ్లిక్ టాయిలెట్లు శిథిలం కావడం... ఉన్న వాటికి కేర్ టేకర్లు లేకపోవడం... రన్నింగ్ వాటర్ సదుపాయం కొరత కారణాలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పట్టణ జనాభాలో 20 శాతం మందికి అసలు వ్యక్తిగత టాయిలెట్లు లేవు. ఇళ్లలో టాయిలెట్లు ఉన్నా బహిరంగ మలవిసర్జనకు అలవాటు పడిన వారు మరో 10 శాతం వరకు ఉన్నారు. వీరంతా చెరువులు, గోస్తనీనది తీరప్రాంతాలను వినియోగిస్తుండడంతో ఆ ప్రాంతాలు కలుషితం అవుతున్నాయి. దీంతో చెరువులు, నదీ ద్వారం వద్ద ఆధ్యాత్మిక కార్యక్రమాల నిర్వహణకు నిత్యం ఆటంకాలు ఎదురవుతున్నాయి. స్వచ్ఛ సర్వేక్షణ్ ర్యాంకింగ్ సమయంలో పబ్లిక్ టాయిలెట్లపై జీవీఎంసీ అధికారులు తీసుకునే శ్రద్ధ తర్వాత కనిపించడం లేదు. వీటి వద్ద శాశ్వతంగా కేర్ టేకర్లను నియమించి వారికి ఉపాధి కల్పించడం వల్ల మాత్రమే బహిరంగ మలవిసర్జనను అరికట్టవచ్చని పట్టణ ప్రజలు అంటున్నారు. ప్రస్తుతం కార్మికవాడకు సంబంధించి కొండపేట, గ్రంథాలయ వీధి – 1, ఈఎస్ఐ ఆస్పత్రి వద్ద మాత్రమే పబ్లిక్ టాయిలెట్లు కేర్ టేకర్ల నిర్వహణలో పనిచేస్తున్నాయి. బంగ్లామెట్ట, గ్రంథాలయ వీధి – 2లో కేర్ టేకర్లు లేకపోవడం, రామన్నపేట, శ్రీనగర్, చిట్టివలస జెడ్పీ హైస్కూల్ వద్ద నిర్వహణ లేక శిథిలావస్థకు చేరుకున్నాయి.



గ్రంథాలయ వీధిలో తాళం వేసి ఉన్న టాయిలెట్లు



శ్రీనగర్ కాలనీలో శిథిలమైన పబ్లిక్ టాయిలెట్లు

బహిరంగ మలవిసర్జన చేస్తే జరిమానా

జీవీఎంసీ పరిధిలో బహిరంగ మలవిసర్జన చేసేవారి నుంచి రూ.100 నుంచి రూ.500 వరకు జరిమానా విధించాలని అధికారులు శానిటేషన్ కార్యదర్శులకు ఆదేశాలు జారీ చేశారు. పబ్లిక్ టాయిలెట్లు శిథిలమై మరే ప్రత్యామ్నాయ అవకాశాలు లేని వారు చిట్టివలస – చిల్లపేట పెద్ద చెరువు, టి.నగరపాలెం, ఎల్లారమ్మమెట్ట, బంగ్లామెట్ట, శ్మశానవాటిక ప్రాంతాలను బహిరంగ మలవిసర్జనకు వినియోగిస్తున్నారు. ఇటీవల వినాయక చవితి, శరన్నవరాత్రి ఉత్సవాల సమయంలో విగ్రహాల నిమజ్జనానికి బహిరంగ మలవిసర్జన ఇబ్బందికరంగా మారింది. అలాగే కార్తీకమాసంలో పలువురు పవిత్ర స్నానాలు ఆచరించడానికి కూడా నదిని ఆశ్రయిస్తారు. అందువల్ల ప్రస్తుతం ఉన్న పబ్లిక్ టాయిలెట్లకు మరమ్మతులు నిర్వహించి అందుబాటులోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు. వ్యక్తిగత టాయిలెట్లు లేనివారికి ఆరోగ్యంపై అవగాహన పెంచి సొంతంగా నిర్మించుకునేందుకు కార్పొరేట్, స్వచ్ఛంద సంస్థలు, ప్రభుత్వం చేయూత అందించాలని కోరుతున్నారు. తర్వాత బహిరంగ విసర్జనపై ఉక్కుపాదం మోపాలని కోరుతున్నారు.

పీజీ విద్యార్థులకు ఓరియంటేషన్



విజయకుమార్‌ను సత్కరిస్తున్న కళాశాల ప్రతినిధులు

తగరపువలస: సంగివలస అనిల్ నీరుకొండ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌లో కొత్తగా చేరిన పీజీ విద్యార్థులకు గురువారం ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఏలూరు ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేవీవీ విజయకుమార్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సమాజంలో వైద్యులకు ఉన్న పేరు ప్రఖ్యాతులను నిలబెట్టేలా విద్యార్థుల ఆలోచనలు సాగాలని సూచించారు. డాక్టర్ దివాకర్ కృష్ణారెడ్డి, డీన్ డాక్టర్ పీవీ సుధాకర్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.శ్రీధర్‌రెడ్డి, మెడికల్ సూపరింటెండెంట్ సుజాత రత్నకుమారి తదితరులు మాట్లాడారు.

ప్రతిభ కనబరిచిన దినేష్‌కు అభినందనలు



విజేతను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ విజయలక్ష్మి

మధురవాడ: కొమ్మాది రోడ్డులోని విజయం స్కూల్‌లో 8వ తరగతి చదువుతున్న గొలగాని దినేష్ అంతర్జాతీయ స్కేటింగ్ పోటీల్లో విశేష ప్రతిభ కనబరిచాడు. ఈ మేరకు గురువారం పాఠశాలలో దినేష్‌తోపాటు అతని తల్లిదండ్రులను పిన్సిపాల్ డాక్టర్ కె. విజయలక్ష్మి సత్కరించి, అభినందించారు. గత నెల 23 నుంచి 28 వరకు చైనాలో నిర్వహించిన ఏషియన్ రోలర్ స్కేటింగ్ ఫెయిర్స్ విభాగంలో ద్వితీయ స్థానంలో నిలిచి వెండి పతకం సాధించాడు.

గాంధీబొమ్మ వీధిలో అన్నసంతర్పణ



గాంధీబొమ్మ వీధిలో స్థానికులతో ఎమ్మెల్సీ వంశీకృష్ణ శ్రీనివాస్

తగరపువలస: జీవీఎంసీ ఒకటో వార్డు గాంధీబొమ్మ వీధిలో కాణిపాక యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అమ్మవారి ఉత్సవాల్లో గురువారం ఎమ్మెల్సీ వంశీకృష్ణ శ్రీనివాస్ యాదవ్ పాల్గొన్నారు. అమ్మవారిని దర్శించుకుని స్థానికులతో కాసేపు మాట్లాడారు. అనంతరం అన్నసంతర్పణలో పాల్గొన్నారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు జగుపల్లి ప్రసాద్, తమ్మిన రాము, తమ్మిన ఆంజనేయులు, నాగేశ్వరరావు, దుక్క పోతన్న, జగుపల్లి కనకారావు, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్‌లో విక్రాంత్ కౌల్ ప్రతిభ



విక్రాంత్ కౌల్‌ను అభినందిస్తున్న స్కూల్ డైరెక్టర్ శ్రీనివాసరావు

భీమునిపట్నం: స్థానిక కీతిన్‌పేటలోని సన్ స్కూల్ విద్యార్థి క్రికెట్ పోటీల్లో ప్రతిభ చూపాడు. పదో తరగతి చదువుతున్న కె.విక్రాంత్ కౌల్ ఇటీవల జరిగిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొని రాష్ట్ర జట్టుకు కెప్టెన్‌గా ఎంపికైయ్యారు. ఈ మేరకు గురువారం పాఠశాల డైరెక్టర్ కైతపల్లి శ్రీనివాసరావు అభినందించారు. త్వరలో జరగనున్న పోటీల్లో మరింతగా రాణించాలని సూచించారు.

'సురక్ష' శిబిరంలో 522 మందికి వైద్య సేవలు



శిబిరంలో వైద్య సేవల కోసం పేర్లు రిజిస్ట్రేషన్ చేయించుకుంటున్న స్థానికులు

పీఎం పాలెం: పీఎం పాలెం యూపీహెచ్‌సీలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం గురువారం నిర్వహించారు. పరిసర ప్రాంతాలకు చెందిన 522 మందికి వైద్య సిబ్బంది పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. నిపుణులు పరీక్షలు చేశారని స్థానిక వైద్యాధికారి సుజాన్ పిల్లా తెలిపారు. కంటి వైద్యులు 50 మందిని పరీక్షించి ఏడుగురికి ఉచితంగా కళ్లద్దాలు అందజేశారు. వైద్య సిబ్బంది, ఆశ వర్కర్లు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

ఆటోల నిలిపివేతతో ట్రాఫిక్ కష్టాలు



అంబేడ్కర్ కూడలిలో సిటీబస్సుకు అడ్డంగా నిలిపిన ఆటో

తగరపువలస: స్థానిక అంబేడ్కర్ కూడలిలోని బస్టాప్‌లో రోజూ గంటల తరబడి ఆటోలను నిలుపుతుండడంతో ట్రాఫిక్ సమస్యలు ఎదురవుతున్నాయి. ప్రయాణికులతో ఆటో నిండే వరకు సిటీబస్సులు వచ్చినా పక్కకు, ముందుకు కదపడం లేదు. దీంతో అతి కష్టం మీద బస్సులను డ్రైవర్లు పక్కనుంచి కదిలించే ప్రయత్నం చేస్తే ఆటోకు తగిలిందని, సమాధానం చెప్పాలని ఆటో కార్మికులు బస్సు సిబ్బందితో వాగ్వాదానికి దిగుతున్నారు. దీంతో వరుసగా ప్రధాన రహదారిలో సిటీబస్సులు నిలిచిపోతున్నాయి. ఫలితంగా నిమిషాల వ్యవధిలో ట్రాఫిక్‌కు తరచూ అంతరాయం ఏర్పడుతోంది. బుధవారం మధ్యాహ్నం కూడా ఇదే సంఘటన కారణంగా 222 ఆర్ సిటీబస్సు సిబ్బందికి, ఆటో కార్మికునికి తగాదా జరిగింది. ఆటో కార్మికుడు బలవంతంగా బస్సు డ్రైవర్‌ను కిందకు దించి తోటి కార్మికులను పోగేశాడు. 15 నిమిషాలపాటు ట్రాఫిక్‌కు అంతరాయం కలగడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఇలాంటి సంఘటనల కారణంగా స్థానిక ప్రధాన రహదారిపై మిగిలిన వారు ఇబ్బందులు పడుతున్నారు. బస్సులు, ఆటోలు ఒకేచోట కాకుండా వేర్వేరు చోట్లలో నిలిపేలా ట్రాఫిక్ పోలీసులు, జీవీఎంసీ సిబ్బంది చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

25న విరాట్ హిందూ సమ్మేళనం

ఎంవీపీకాలనీ: ఎంవీపీ కాలనీలోని అల్వార్‌దాస్ మైదానంలో ఈ నెల 25న విరాట్ హిందూ సమ్మేళనం నిర్వహించనున్నారు. విరాట్ హిందూ సంఘ్ ఆధ్వర్యంలో కార్యక్రమం జరగనుంది. దీనికి సంబంధించిన కరపత్రాన్ని బీజేపీ ఎంపీ జీవీఎల్ నరసింహారావు గురువారం లాసన్స్ బే కాలనీలోని పార్టీ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాతూ హిందుత్వంపై అసాంఘిక శక్తుల దాడులను అడ్డుకోవడానికి సమ్మేళనాలు అవసరమన్నారు. కొంతమంది కొన్ని వర్గాల మెప్పు కోసం సనాతన ధర్మాన్ని కించపరిచేలా మాట్లాడుతున్నారన్నారు. అలాంటి వారి వ్యాఖ్యలను ఖండించాల్సిన అవసరం హిందుత్వ వాదులపై ఉందన్నారు. హిందుత్వాన్ని రక్షించుకునేందుకు వచ్చే ఎన్నికల్లో కేంద్రంలో బీజేపీ ప్రభుత్వాన్ని గెలిపించాలన్నారు. బీజేపీ నాయకులు, సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.

ర్యాగింగ్ నిషేధంపై పోస్టర్ ఆవిష్కరణ

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ర్యాగింగ్ నిషేధం, పర్యవసనాలు, చట్టాలపై అవగాహన కల్పించేలా తీర్చిదిద్దిన ప్రత్యేక పోస్టర్లను ఏయూ విద్యార్థి వ్యవహారాల విభాగం డీన్ ఆచార్య ఎస్.విజయ్‌మోహన్ గురువారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ప్రథమ సంవత్సరం తరగతులు ప్రారంభమైన నేపథ్యంలో ర్యాగింగ్ నిషేధంపై అవగాహన కల్పిస్తున్నారు. కార్యక్రమంలో పాలక మండలి సభ్యురాలు ఆచార్య పి.సునీత, ఆచార్య కె.సీతామాణిక్యం, ఆచార్య ఎ.కె.ఎం.పవార్, డాక్టర్ బెన్నీ తదితరులు పాల్గొన్నారు.

నేవీలో ఉద్యోగం పేరిట రూ.5.67 లక్షలకు టోకరా

తగరపువలస: నేవీలో తన కుమార్తెకు ఉద్యోగం ఇప్పిస్తానని జేవీ అగ్రహారం(అప్పికొండవీధి)కి చెందిన ఆదిలక్ష్మి దఫదఫాలుగా తన నుంచి రూ.5,67,000 కాజేసి ఇప్పుడు ముఖం చాటేసిందని తోటవీధికి చెందిన గరుగు సావిత్రి ఆరోపిస్తోంది. బీఎస్సీ చదువుతున్న తన కుమార్తె కల్యాణికి నేవీలో మునీషా బేగం అనే మహిళ ద్వారా ఉద్యోగం ఇప్పిస్తానని ఈ మొత్తాన్ని కాజేసినట్టు బాధితురాలు తెలిపింది. ఉద్యోగం కోసం మరో రూ.1.60 లక్షలు అడగటంతో మోసపోయినట్టు గుర్తించినట్లు చెప్పింది. దీనిపై గతంలో భీమిలి పోలీసులకు ఫిర్యాదు చేయగా సెప్టెంబర్‌లో రూ.20 వేలు ఇచ్చి మిగిలిన వాయిదాలు చెల్లించలేదన్నారు. విడతల వారీగా డబ్బులు తిరిగి ఇస్తానని ఆదిలక్ష్మి పోలీసుల ముందు అంగీకారపత్రం ఇచ్చి.. ఇప్పుడు ముఖం చాటేస్తోందన్నారు. కుమార్తె ఉద్యోగం కోసం అప్పులు తెచ్చి మోసపోయానని, భీమిలి పోలీసులు జోక్యం చేసుకుని న్యాయం చేయాలని ఆమె కోరింది.

కనక మహాలక్ష్మికి సహస్ర తులసీదళార్చన



తులసీదళార్చనలో సిరులతల్లి

డాబాగార్డెన్స్: నగరంలోని బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి దేవస్థానంలో గురువారం సహస్ర తులసీదళార్చన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన పూజలో నలుగురు ఉభయదాతలు పాల్గొన్నారు. అమ్మవారి త్రికాల పంచామృతాభిషేక సేవలో ఆరుగురు ఉభయదాతలు పాల్గొన్నారు. సహస్ర తులసీదళార్చనలో పాల్గొనదలచే భక్తులు రూ.1,500, త్రికాల పంచామృతాభిషేక సేవలో పాల్గొనే భక్తులు రూ.1,000 పూజా రుసుము చెల్లించాలని ఆలయ కార్యనిర్వహణాధికారి కె.శిరీష తెలిపారు. కార్యక్రమంలో ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, ధర్మకర్తలు సత్యరూపవాణి, అనురాధ, ఎస్.సతీష్, సహాయ కార్యనిర్వహణాధికారి కె.తిరుమలేశ్వరరావు ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

సీఎం జగన్ ఆత్మీయ పలకరింపు



సీఎం జగన్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఏపీ నగరాలు కార్పొరేషన్ చైర్‌పర్సన్ సుజాత



ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

తగరపువలస / మధురవాడ: విశాఖ పర్యటనకు వచ్చిన రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని మధురవాడ ఐటీ హిల్ – 3 హెలీప్యాడ్ వద్ద గురువారం పలువురు నాయకులు కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. మాజీ మంత్రి, ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు సీఎం జగన్‌కు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో అభివృద్ధి పనులపై మాట్లాడారు. అనంతరం ఏపీ నగరాలు కార్పొరేషన్ చైర్‌పర్సన్ పిళ్లా సుజాత, సీనియర్ నాయకుడు పిళ్లా సత్యనారాయణ కలవగా వారిని సీఎం జగన్ మోహన్‌రెడ్డి ఆప్యాయంగా పలకరించారు.

బీటీ రోడ్ల నిర్మాణానికి హామీ

ఆనందపురం : గ్రామీణ ప్రాంతాల్లో బీటీ రోడ్ల నిర్మాణానికి నిధులు అందిస్తామని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి హామీ ఇచ్చారని మండలంలోని గండిగుండం సర్పంచ్, జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు గంద్రెడ్డి శ్రీనివాస్ చెప్పారు. గురువారం నగరంలోని సీఎం జగన్‌ను ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావుతో కలిశారు. ఈ సందర్భంగా బీటీ రోడ్ల సమస్యను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా సానుకూలంగా స్పందించారని చెప్పారు. త్వరలోనే పంచాయతీలకు నిధులు విడుదల చేస్తామని హామీ ఇచ్చారని, సర్పంచ్‌ల సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్టు చెప్పారు.



సీఎం జగన్‌తో మాట్లాడుతున్న సర్పంచ్‌ల సంఘం జిల్లా అధ్యక్షుడు గంద్రెడ్డి శ్రీనివాస్

పంట కాలువ మూసి నిర్మిస్తున్న కట్టడాలపై ఫిర్యాదు



భీమిలి జెడ్పీ రాముకు ఫిర్యాదు చేస్తున్న చిల్లపేట రైతులు

తగరపువలస: జీవీఎంసీ రెండో వార్డు చిట్టివలస సర్వే నంబర్ 68/41లో 90 ఎకరాలకు సంబంధించిన పంట కాలువను మూసేసి పిల్లర్లతో నిర్మిస్తున్న కట్టడాలను వెంటనే నిలిపివేయాలని బాధిత రైతులు గురువారం భీమిలి జెడ్సీ బి.రాముకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిల్లపేట, చిట్టివలస చెరువుల మీదుగా ప్రవహించే వర్షం నీరు పంట పొలాల మీదుగా ప్రవహించేందుకు బ్రిటీష్ ప్రభుత్వం పై సర్వే నంబరులోని 5.03 ఎకరాలకు చెందిన ముగ్గురు ఉమ్మడి రైతుల స్థలంలో రెండు కాలువలు నిర్మించిందన్నారు. వీటి ద్వారానే ప్రవహించే నీరు సముద్రంలో కలుస్తుండేదన్నారు. జీరు అప్పలస్వామి కుటుంబీకులు ముగ్గురికి చెందిన 5.03 ఎకరాల ఉమ్మడి ఆస్తిలో 2.69 ఎకరాలను 2007, 2009, 2010లో విక్రయించారన్నారు. ఆ ప్రాంతంలో 0.86 సెంట్ల భూమి కొనుగోలు చేసిన దుర్గాప్రసాద్ తమ భూమిని కూడా ఆక్రమించి అక్రమంగా కట్టడాలు చేపడుతున్నారన్నారు. ఇప్పటికే ఈ విషయాన్ని భీమిలి ఆర్డీవో, తహసీల్దార్, జీవీఎంసీ మేయర్, నగర పోలీస్ కమిషనర్, డీసీపీలకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశామన్నారు.

పంట భూముల్లోని కాలువ కప్పకూడదని ఆర్డీవో గత నెల 19న ఉత్తర్వులు కూడా జారీ చేశారన్నారు. అయినప్పటికీ అనుమతులు లేకుండా రాత్రి వేళ నిర్మాణం చేపడుతున్న వారిని నిరోధించి తమకు న్యాయం చేయాలని కోరారు. జీరు రమణమ్మ, జీరు పార్వతి, జీరు శ్రీనివాసరెడ్డి, చిల్ల గణేష్‌రెడ్డి, జీరు ప్రసాదరెడ్డి తదితరులు ఫిర్యాదు చేశారు.

ప్రారంభానికి శ్రీధర్మ శాస్త్ర సేవాపీఠం సిద్ధం



ప్రారంభోత్సవానికి సిద్ధమైన శ్రీ ధర్మశాస్త్ర సేవా పీఠం

పద్మనాభం: మండలంలోని మద్ది గ్రామంలో సుందరంగా నిర్మించిన శ్రీధర్మ శాస్త్ర సేవా పీఠం ప్రారంభోత్సవానికి సిద్ధమైంది. భక్తుల ఆర్థిక సహకారంతో ఈ పీఠాన్ని నిర్మించారు. అన్ని హంగులు పూర్తి చేసుకుని ప్రారంభోత్సవానికి సిద్ధం చేశారు. అయ్యప్ప మాల ధరించిన వారికి మధ్యాహ్నం భిక్ష ఉచితంగా సమకూర్చాలని నిర్ణయించారు. ఈ నెల 5న పీఠాన్ని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ప్రారంభించనున్నారని ఎంపీపీ కంటుబోతు రాంబాబు తెలిపారు.

నిరుపయోగంగా బోరు బావి



స్వతంత్రనగర్ – గణేష్‌నగర్ మధ్య నిరుపయోగంగా ఉన్న బోరు బావి

మధురవాడ: జీవీఎంసీ 7వ వార్డు స్వతంత్రనగర్ – గణేష్‌నగర్ మధ్య ఎంపీఈపీ పాఠశాల వాటర్ ట్యాంక్‌ని ఆనుకుని ఉన్న ప్రభుత్వ బోరు బావి నిరుపయోగంగా ఉంది. ఇక్కడ అపరిశుభ్ర వాతావరణంలో ఎవ్వరూ పట్టించుకోకపోవడం వల్ల వేలాది రూపాయలు వృథాగా ఖర్చు చేసినట్లయింది. ప్రభుత్వ అధికారులు పట్టించుకోవడం లేదు. ఉన్నతాధికారులు స్పందించి పరిసరాలు శుభ్రం చేయించి, ప్రజా అవసరాల కోసం బోరు వినియోగించేలా చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

పబ్లిక్ డిమాండ్

రహదారికి ఇరువైపులా తుప్పలు తొలగించండి



పీఎం పాలెం బాబా కళాశాల రహదారి పక్కన తుప్పలు

తగరపువలస: జీవీఎంసీ మధురవాడ జోన్ పీఎం పాలెం చివరి బస్టాప్ నుంచి బాబా ఇంజినీరింగ్ కళాశాల రహదారికి ఇరువైపులా తుప్పలు పెరిగిపోవడంతో విష పురుగులకు ఆవాసంగా మారింది. ఇక్కడి రహదారులు కూడా శిథిలమయ్యాయి. చీకటి పడిన తర్వాత ఈ మార్గంలో రాకపోకలకు ఇబ్బందిగా ఉంది. సంబంధిత అధికారులు స్పందించి రహదారికి ఇరువైపులా తుప్పలు తొలగించాలి.

– బెహరా మహేష్, పీఎం పాలెం.